సాక్షి తిరుపతి

గురువారం । 7 । నవంబర్ । 2024



అడ్డదిడ్డం.. గందరగోళం!

తిరుపతి నగరంలో వాహనదారులు, అంగళ్ల నిర్వాహకులు, పాదచారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

- 10లో



ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

పాకాల మండలంలో మంగళవారం రాత్రి ఏనుగులు జీభత్సం సృష్టించాయి. మామిడి, పనస తోటలను నాశనం చేశాయి.

- 10లో



కదంతొక్కిన విద్యార్థులు

ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు.

- 10లో

న్యూస్‌రీల్

తిరుమలలో బయో గ్యాస్ ప్లాంట్



శిలాఫలకం ఆవిష్కరణలో అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల : తిరుమలలోని కాకులమాను తిప్ప వద్ద బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) శ్రీకారం చుట్టింది. బుధవారం ఉదయం ఈ మేరకు టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి భూమి పూజ నిర్వహించారు. మొత్తం 2.22 ఎకరాల్లో బయో గ్యాస్ ప్లాంట్, 0.17 ఎకరాల్లో కంపోస్టు నిల్వ కేంద్రం నిర్మించనున్నారు. రోజుకు 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో బయో గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్లాంట్ నిర్మాణానికి రూ.12.85 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ రూపొందించగా రూ.7.05 కోట్లు ఐఓసీఎల్, రూ.5.80 కోట్లను టీటీడీ సమకూర్చనుంది. ఈ ప్లాంటు నిర్మాణం పూర్తయితే మిశ్రమ వ్యర్థాల ద్వారా బయో గ్యాస్‌ను ఉత్పత్తి చేసి రెండున్నర కిలో మీటర్ల దూరంలోని తరిగొండ అన్న ప్రసాద కేంద్రానికి పైపు లైన్ ద్వారా పంపిణీ చేయనున్నారు. భూమి పూజ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓ ఆశాజ్యోతి, ఐఓసీఎల్ ఈడీ అండ్ ఎస్‌హెచ్ బి.అనిల్ కుమార్, సీజీఎంలు వైవీ రమణరావు, ఏంఆర్‌వీ బద్రీనాథ్ పాల్గొన్నారు.

'అపార్' నమోదు వేగవంతం

తిరుపతి అర్బన్: విద్యార్థుల అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఈ నెల 20వ తేదీకి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు అపార్ నమోదు చేయాలన్నారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ఒకే దేశం, ఒకే స్టూడెంట్ కార్డు పేరుతో అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్డు ద్వారా విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు నంబర్ అన్నీ కలిపి డిజిటల్ రూపంలో భద్రపరచడం జరుగుతుందని వివరించారు. అపార్ నంబర్‌తో విద్యార్థులు దేశంలో ఎక్కడైనా చదువుకునే వెసులుబాటు కలుగుతుందని, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల వివరాలు నమోదు, ధ్రువీకరణ సులభతరమవుతుందని తెలిపారు. ఈ కార్డు ద్వారా విద్యార్థుల అకాడమిక్ సమాచారం, ఉపకార వేతనాలు, క్రీడల్లో సాధించిన అంశాలు, డిజిటల్ లాక్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుసంధానమై ఉండటంతో సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం డీఈఓ కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 3,07,330 మంది విద్యార్థులకు గాను 2,06,651 మందికి అపార్ నమోదు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోనే ప్రస్తుతం 4వ స్థానంలో ఉన్నామని తెలిపారు.

ఎరువు.. కరువు!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా సాగేది. అన్నదాతలకు సకాలంలో పెట్టుబడి సాయం అందేది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంటి ముంగిటకే ఎరువులు చేరే పరిస్థితి ఉండేది. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక ఆదర్శవంతంగా సేవలందిస్తున్న ఆర్‌బీకేలను కుట్రపూరితంగా నిర్వీర్యం చేస్తోంది. దీంతో విత్తనాలు.. ఎరువులు సక్రమంగా అందుబాటులో లేక రైతాంగం నానా అవస్థలు పడుతోంది. అధిక ధరలు వెచ్చించి ప్రైవేట్ దుకాణాలపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. ఈ క్రమంలో సేద్యం తలకు మించిన భారంగా మారుతోంది.





- ఖాళీగా ఆర్‌బీకేలు, సొసైటీలు
- ఎరువుల కోసం అన్నదాతల తిప్పలు
- కళకళలాడుతున్న ప్రైవేట్ షాపులు
- అధిక ధరలతో రైతుల ఇక్కట్లు
- అదనపు భారంగా రవాణా చార్జీలు

తిరుపతి అర్బన్ : రబీ సీజన్ అక్టోబర్ 1వ తేదీన మొదలై..మార్చి 31 వరకు కొనసాగుతుంది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా రైతులు ఒక్క వరి పంటనే సుమారు లక్ష ఎకరాలకు పైగా సాగుచేయనున్నారు. ఇతర పంటలు మరో లక్ష ఎకరాలు చేపట్టనున్నారు. మొత్తంగా రబీ సీజన్‌లో దాదాపు రెండు లక్షల ఎకరాల్లోని పంటలకు ఎరువుల అవసరముంది. అయితే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వ్యవసాయశాఖ అధికారులు సైతం ముందస్తు ఏర్పాట్లు చేయడంలో వైఫల్యం చెందినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఆర్‌బీకేల్లో అవసరాల మేరకు ఎరువులను అందుబాటులో ఉంచలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సింగిల్ విండో కార్యాలయాల్లో సైతం ఎరువులు అంతంత మాత్రమే ఉంటున్నాయని వాపోతున్నారు. అయితే ప్రైవేటు డీలర్ల వద్ద మాత్రం పుష్కలంగా ఎరువులున్నాయని వెల్లడిస్తున్నారు. దీంతో చేసేది లేక అధిక ధరలు చెల్లించి ప్రైవేటు దుకాణాల్లో ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నామని వివరిస్తున్నారు. ఆర్‌బీకేలు, సొసైటీల్లో ఎరువు బస్తా ధర రూ.270 ఉంటే, ప్రైవేట షాపుల్లో రూ.310కి విక్రయిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు బస్తాపై ఆర్‌బీకేకి, ప్రైవేటు దుకాణాలకు రూ.30 నుంచి రూ.40 తేడా ఉందని వెల్లడిస్తున్నారు. ఆర్‌బీకేలు గ్రామంలోనే ఉంటాయి కాబట్టి రవాణా చార్జీలు ఉండవని, ప్రైవేట్ షాపుల్లో అయితే అదనంగా రవాణా చార్జీల మోత తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు.

రూ.57లక్షల బకాయి

ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా కార్యాలయం నుంచి సాధారణంగా ఆర్‌బీకే, సొసైటీలకు ఎరువులు సరఫరా చేస్తారు. ఎంత మేర కావాల్సి ఉంటుందో ఇండెంట్ పెట్టుకుంటే 48 గంటల్లోనే అందజేస్తారు. వారంలోపు ఎరువులు విక్రయించి నగదును మార్క్‌ఫెడ్‌కు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఆర్‌బీకేల నుంచి రూ.17లక్షలు, సొసైటీల నుంచి రూ.40లక్షలు మార్క్‌ఫెడ్‌కు బకాయిలు ఉన్నాయి. ఎరువుల విక్రయం తర్వాత సకాలంలో సొమ్మును చెల్లించాల్సిన వ్యవసాయశాఖ అధికారులు అలసత్వం వహించారు. దీంతో మార్క్‌ఫెడ్ నుంచి ఎరువులు సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు ఆర్థిక భారం మోయలేక నానా అవస్థలు పడుతున్నారు. అయితే ఇందులో మరో వాదన గట్టిగా వినిపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసేందుకు కూటమి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చూపుతోందని పలువురు రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ప్రైవేటు వ్యాపారులకు లబ్ధి చేకూర్చేందుకే ఆర్‌బీకేలు, సొసైటీల్లో ఎరువుల కొరతను కృత్రిమంగా సృష్టిస్తున్నారని విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేలు, సొసైటీల్లో పుష్కలంగా ఎరువులు ఉండేవని గుర్తుచేస్తున్నారు. తక్కువ ధరకే సకాలంలో ఎరువులు అందేవని వివరిస్తున్నారు.



ప్రైవేట్ దుకాణంలో ఎరువులు

2022-23 రబీలో ఎరువుల విక్రయ వివరాలు

ఎరువు (టన్నుల్లో)	ఆర్‌బీకేలు	సొసైటీలు
యూరియా	15,021	4,686
డీఏపీ	1,307	362
ఎంఓపీ	247	172
కాంప్లెక్స్	523	201
ఎస్ఎస్‌పీ	11	35
మొత్తం	17,109	5,456

2023-24 రబీలో..

ఎరువు (టన్నుల్లో)	ఆర్‌బీకేలు	సొసైటీలు
యూరియా	22,929	3,553
డీఏపీ	1,538	145
ఎంఓపీ	128	125
కాంప్లెక్స్	1,607	94
ఎస్ఎస్‌పీ	05	20
మొత్తం	26,207	3937

2024- 25 ప్రస్తుత రబీలో..

ఎరువు (టన్నుల్లో)	ఆర్‌బీకేలు	సొసైటీలు
యూరియా	4,445	2,202
డీఏపీ	254	284
ఎంఓపీ	108	105
కాంప్లెక్స్	136	405
ఎస్ఎస్‌పీ	04	18
మొత్తం	4,947	3,014

గంటలో అయిపోతున్నాయి



ఎప్పుడో ఒకసారి ఒక లోడు ఎరువులు వస్తున్నాయి. అవి గంటలోనే అయిపోతున్నాయి. ఇక మళ్లీ ఎరువులు ఆర్‌బీకేలకు రావడం లేదు. ప్రస్తుతం ఎరువుల అవసరం ఎక్కువగా ఉంది. మాకు సకాలంలో సరఫరా చేయాల్సిన వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడంల లేదు. ఇక తప్పని పరిస్థితుల్లో వ్యయప్రయాసలకోర్చి ప్రైవేట్ షాపుల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నాం.

– మురళీకృష్ణ, రైతు, వరదయ్యపాళెం

అధిక ధరలు



ఆర్‌బీకేల్లో ఎరువులు ఉంటే రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. లేదంటే పట్టణాలు, నగరాలకు వెళ్లి ఎరువులు తెచ్చుకోవడానికి రవాణా చార్జీల భారం తప్పడంలేదు. మరోవైపు బస్తాకు రూ.30 వరకు అధిక ధర చెల్లించాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం కూడా చేయలేదు. కనీసం అవసరం అయిన మేరకు ఎరువులు అందించాల్సి బాధ్యత ప్రభుత్వానికి లేదా. మమ్మల్ని నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

– మస్తానయ్య, రైతు, వాకాడు

ఎరువులు అందిస్తాం



ఆర్‌బీకేలకు అవసరాలకు తగ్గట్టు ఎరువులు అందించడానికి కృషి చేస్తాం. ఎరువుల విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. సీజన్ ప్రారంభం కావడంతో సేద్యం పనులు జోరుగా సాగుతున్నాయి. ఆర్‌బీకేల నుంచి ఎరువులను విక్రయించిన నగదును ఏపీ మార్క్‌ఫెడ్‌కు చెల్లించాల్సి ఉంది. చెల్లించని వారితో మాట్లాడి వెంటనే జమ చేసేలా చర్యలు చేపడుతాం. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం.

– ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఇండెంట్ పెడితే ఎరువులు ఇస్తాం



ఆర్‌బీకేలకు ఎంత ఎరువు కావాలో ఇండెంట్ పెడితే 48 గంటలు పంపుతాం. అలాగే ఆర్‌బీకేలు, సొసైటీల నుంచి కూడా ఎరువులు విక్రయించిన నగదును వెంటనే మార్క్‌ఫెడ్‌కు జమ చేయాల్సి ఉంటుంది. ఆర్‌బీకేల నుంచి రూ.17లక్షలు, సొసైటీల నుంచి రూ.40లక్షలు బకాయిలు ఉన్నాయి. ఈ కారణంగానే ఇబ్బందులు తలెత్తాయి. వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సకాలంలో చెల్లింపులు చేయిస్తే సరిపోతుంది.

– పవన్‌కుమార్, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి

పదవి రాకముందే పెత్తనం

– చెంగాళమ్మ ఆలయంలో టీడీపీ నేత హల్‌చల్



చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆలయాల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని కూటమి ప్రభుత్వమే చెబుతోంది. సనాతన ధర్మం కాపాడాలని స్పష్టం చేస్తోంది. అయితే తూతూ మంత్రంగానే నిబంధనలు అమలు చేస్తోంది. సూళ్లూరు పేటకు చెందిన ఓ టీడీపీ సీనియర్ నేత వ్యవహారమే ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. స్థానిక చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ పదవి తనకే వస్తుందని ఆయన ముమ్మరంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆలయంలోని ప్రతి విషయంలో జోక్యం చేసుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. పూజలు, ప్రసాదాల పంపిణీ, హుండీ లెక్కింపు ఏదైనా తాను వచ్చిన తర్వాతే చేపట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అయినా పదవి రాకుండానే మితిమీరిన జోక్యం తగదని తెలుగు తమ్ముళ్లే చెవులు కొరుక్కుంటుండడం గమనార్హం.

సకాలంలో నిధుల సద్వినియోగం

తిరుపతి అర్బన్ : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన పనులతోపాటు ఎంపీ నిధులతో చేపట్టిన పనులు, జిల్లా మినరల్ ఫండ్స్ నిధులు సకాలంలో పూర్తి చేసి సద్వినియోగం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, పీఆర్ ఎస్ఈ రామ్మోహన్, ఇరిగేషన్ అధికారి మదన్‌గోపాల్ పాల్గొన్నారు.

10న డీఎస్సీ కోచింగ్‌కు పరీక్ష

- జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు

తిరుపతి అర్బన్ : డీఎస్సీ అభ్యర్థులను ఉచిత శిక్షణ అంటూ కూటమి సర్కార్ మూడు నెలలుగా ఊరిస్తున్న సంగతి తెలిసిందే. ఆగస్టులో బీసీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ అంటూ దరఖాస్తులు స్వీకరించారు. సెప్టెంబర్‌లో ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అక్టోబర్‌లో ఎస్సీ అభ్యర్థుల ద్వారా దరఖాస్తులు చేయించుకున్నారు. అయితే బీసీ విద్యార్థులకు సంబంధించి 300 దరఖాస్తులు రాగా మెరిట్ ప్రకారం అంటూ 200 మందిని మాత్రమే ఎంపిక చేశారు. అదే క్రమంలో ఎస్సీ, ఎస్టీకి చెందిన దరఖాస్తులు 539 వచ్చాయని అందులో 150 మందిని మాత్రమే ఎంపిక చేస్తున్నామని వెల్లడిస్తున్నారు. అందుకే ఈ నెల 10వ తేదీన ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు వివరిస్తున్నారు. డీఎస్సీకి చెందిన సిలబస్ పైనే 539 మందికి తిరుపతిలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలలో ఎంట్రన్స్ పరీక్ష చేపట్టనున్నారు. ఆ మేరకు హాల్ టికెట్లు జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఫలితాల ఆధారంగా 150 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలియజేస్తున్నారు.

పటిష్ట ఏర్పాట్లు

పరీక్షకు సంబంధించి పటిష్టమైన ఏర్పాటు చేపట్టినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. పరీక్షకు 30 నిమిషాలు ముందే రావాలని, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆమేరకు పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణను ఆదేశించారు. ఈ మేరకు 7013008498 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ట్రాక్ తప్పకుంటేనే లైసెన్స్!

ఒకప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే దళారీని పట్టుకుంటే చాలు.. ఎంచక్కా పని పూర్తయ్యేది. అరకొర నైపుణ్యంతో బండి నడిపినా పెద్ద ఇబ్బంది ఉండేది కాదు. అయితే ప్రస్తుతం లైసెన్స్ ప్రక్రియను రవాణాశాఖ అధికారులు కట్టుదిట్టం చేస్తున్నారు. వచ్చీరాని డ్రైవింగ్‌తో రోడ్డెక్కి ప్రమాదాలకు కారణం కాకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను అందుబాటులో తీసుకువస్తున్నారు. నిర్ణీత ప్రమాణాలతో వాహనం నడిపిన వారికే లైసెన్స్ మంజూరు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మొత్తం ప్రక్రియను సెన్సార్ సాయంతో క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. సమగ్ర వివరాలను కంప్యూటర్‌లో సైతం నిక్షిప్తం చేయనున్నారు.

- మొక్కుబడి డ్రైవింగ్ టెస్ట్‌కు మంగళం
- ఆటోమేటిక్ విధానంలో పరీక్ష
- రహదారి నిబంధనల మేరకు ఏర్పాట్లు
- ప్రమాణాల మేరకే ఉత్తీర్ణత
- వివరాలన్నీ కంప్యూటర్‌లో అప్‌లోడ్

తిరుపతి మంగళం : డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వచ్చే వారికి రవాణాశాఖ తనిఖీ అధికారులే పరీక్ష నిర్వహించి లైసెన్స్‌లను అందజేసే పద్ధతి చాలాకాలం నుంచి కొనసాగుతోంది. మాన్యువల్‌గా సాగుతున్న ఈ విధానానికి స్వస్తి చెప్పి.. మోటారు వాహన చట్టం నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆధునికీకరణకు రవాణాశాఖ చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఆటోమెటిక్ పద్ధతిలో ట్రాక్‌ల నిర్వహణ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో నిర్దేశిత ప్రమాణాల మేరకు వాహనం నడిపితేనే డ్రైవింగ్ లైసెన్స్ లభించనుంది. ఈ క్రమంలో లైసెన్స్ కోసం టెస్టుకు వచ్చేవారు ఎలాంటి దొడ్డిదారి మార్గాలను అన్వేసించకుండా బాగా శిక్షణ తీసుకుని డ్రైవింగ్‌లో నైపుణ్యం సంపాదించాలని తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ స్పష్టం చేస్తున్నారు.



తిరుపతిలోని జిల్లా రవాణాశాఖాధికారి కార్యాలయంలో సెన్సార్ ఏర్పాటు చేయనున్న డ్రైవింగ్ ట్రాక్

పెరిగిన వాహనాల వినియోగం

ఇప్పుడు చాలా మందికి బైక్ లేదా కారు నిత్యావసరంగా మారింది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు అన్ని వర్గాల వారు వ్యక్తిగత వాహనాలను వినియోగిస్తున్నారు. ఏటా వేలాది మంది కొత్తగా డ్రైవింగ్ నేర్చుకుని వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. రవాణా రంగంలో డ్రైవర్లుగా చేరుతున్నారు. జిల్లాలో గత రెండేళ్లల్లోనే లక్షల మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవడం విశేషం. అయితే చాలా మంది ఎలాంటి డ్రైవింగ్ టెస్టు లేకుండా లైసెన్స్ వచ్చేస్తే బాగుంటుందని బావిస్తుంటారు. ఇందుకోసం ఏజెంట్లను, మధ్యవర్తులను ఆశ్రయిస్తుంటారు. సరిగ్గా నేర్చుకోకుండా, టెస్టుకు హాజరుకాకుండా తప్పుడు పద్ధతుల్లో లైసెన్స్ తీసుకుని, అరకొర అనుభవంతో బండి నడిపితే ప్రమాదాల బారినపడే అవకాశముంటుంది.

టెస్ట్ ఇలా..

వాహదారుల డ్రైవింగ్ నైపుణ్యం పరీక్షించేందుకు రకరకాల ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. కారు నడిపేవారు అన్ని ట్రాక్‌లలో తమ ప్రతిభను చూపాల్సి ఉంటుంది. అలాగే ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనాలు నడిపే డ్రైవర్లకు కూడా ప్రత్యేక ట్రాక్‌లు ఉంటాయి.

హెచ్ : వాహనం ముందుకు వెళ్లిన తర్వాత రివర్స్ చేయాల్సి వస్తే ఎలా తీసుకుంటారో తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది.

ఎస్ : ఒక మూల నుంచి మరో మూలకు టర్న్ చేయాల్సివచ్చినప్పుడు ఎలా బండి నడుపుతున్నారో తెలుస్తుంది.

8 : బాగా మలుపులున్న రోడ్డుపై ఎలా ముందుకు వెళుతున్నారో తెలుసుకునేందుకు దోహదం చేస్తుంది.

ఎత్తు పల్లాల ట్రాక్ : ఎత్తయిన ప్రదేశాలు, చిన్న లోయ వంటి ప్రాంతాల్లో ఎలా వాహనం నడపగలరో పరిశీలించేందుకు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే చివరగా బండిని పార్కింగ్ చేసే పద్ధతిని కూడా పరీక్షిస్తారు.

– టెస్ట్‌కు హాజరయ్యే సమయంలో ఫోర్‌వీలర్ అయితే సీటు బెల్ట్, ద్విచక్రవాహనమైతే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. లేకుంటే ఫెయిల్ చేస్తారు. ట్రాక్‌లో నడిపేటప్పుడు ఎలాంటి తప్పిదాలు చేసినా ఫెయిల్ అయినట్టుగా నిర్ధారిస్తారు. వీరు మరో నెల పాటు శిక్షణ తీసుకుని టెస్ట్‌కు హాజరుకావాల్సి ఉంటుంది.

వందలాదిమందికి టెస్ట్‌లు



జిల్లా వ్యాప్తంగా నిత్యం వందలాది మందికి డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట ప్రాంతాల్లోని డ్రైవింగ్ ట్రాక్‌లలో వాహనదారులు వారి నైపుణ్యాన్ని సక్రమంగా ప్రదర్శిస్తేనే లైసెన్స్‌లు జారీ చేస్తున్నాం. వాహనదారులు డ్రైవింగ్‌పై బాగా పట్టు సాధించిన తర్వాతే టెస్ట్‌కు హాజరుకావాలి. ఏజెంట్లు, మధ్యవర్తుల ద్వారా లైసెన్స్‌లు పొందాలని చూస్తే మీకే నష్టమనే విషయం గుర్తు పెట్టుకోవాలి. తిరుపతి జిల్లా కార్యాలయంలోని డ్రైవింగ్ ట్రాక్‌ను త్వరలోనే ఆధునికీకరణ(సెన్సార్) చేయనున్నాం. – మురళీమోహన్, జిల్లా రవాణాశాఖాధికారి (డీటీఓ)

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 68,146 మంది స్వామివారిని దర్శించుకోగా 22,667 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టిక్కెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం అవుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలైన్‌లోకి వెళ్లాలని, అంతకంటే ముందే వెళ్తే లోపలకు అనుమతించరని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

లైంగికదాడుల నివారణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : మహిళలపై లైంగికదాడుల నివారణకు కృషి చేయాలని, ఈ మేరకు అందరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీడీపీఓలు వారి పరిధిలోని మహిళలకు అండగా ఉండాలని సూచించారు. మరోవైపు బాల్యవివాహాలతో వచ్చే అనర్థాలను వివరించాలని కోరారు. కిషోర్ వికాస్ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. పోషకాహారం లోపం నివారణకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆ దిశగా అంగన్‌వాడీ స్కూళ్లను బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పోషకాహార లోపం తలెత్తకుండా గుడ్లు సక్రమంగా అందేలా, నాణ్యంగా ఉండేలా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పోషణ్ ట్రాక్ యాప్ ద్వారా అంగన్‌వాడీ పిల్లల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డీసీపీఓ శివ శంకర్ పాల్గొన్నారు.


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.80,730
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,335
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.96,100
రిటైల్ వెండి గ్రాము	రూ.99.10

క్లుప్తంగా

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం


విరిగిపోయిన మామిడి చెట్లు

పాకాల : మండలంలోని చంద్రగిరివారిపల్లె, ఎస్టీ కాలనీ, వల్లివేడు గ్రామాల్లోని మామిడి, అరటి, పనస తోటలను మంగళవారం రాత్రి ఏనుగులు నాశనం చేశాయి. మామిడి కొమ్మలను విరిచేశాయి. తోటలు, పొలాల వద్ద పైపు లైన్లను ధ్వంసం చేశాయి. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల గుంపును దారి మళ్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. పరిహారం అందించి ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

విద్యుత్ శాఖ స్టాండింగ్ కౌన్సిల్‌గా మధుసూదన్ రెడ్డి



తిరుపతి రూరల్: విద్యుత్ శాఖ తిరుపతి సర్కిల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది మధుసూదన్ రెడ్డి నియమితులయ్యారు. బుధవారం ఈమేరకు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు ఉత్తర్వులు జారీచేశారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమించిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సీఎండీ సంతోష్ రావుకు మధుసూదన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని రామలింగాపురం ఎస్టీ కాలనీలో తనతో సహజీవనం చేస్తున్న మహిళను అక్టోబర్ 3వ తేదీన హత్య చేసిన కేసులో నిందితుడు చెంచయ్యను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తరలించినట్లు రూరల్ పోలీసులు వెల్లడించారు.

ముక్కంటి హుండీ లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద హుండీల ద్వారా మొత్తం రూ.1,94,41,581 ఆదాయం వచ్చినట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. అలాగే 85.100 గ్రాముల బంగారం, 607.100 కిలోల వెండి, 145 నోట్ల విదేశీ కరెన్సీ వచ్చిందని వివరించారు.

అడ్డదిడ్డం.. గందరగోళం!


కేశవాయన గుంట కూడలిలో ప్రమాదానికి గురైన యువకుడు


ఎస్పీడీసీఎల్ కార్యాలయం రోడ్డు పక్కన కూరగాయల అంగడి, అడ్డగోలుగా పార్క్ చేసిన వాహనాలు

- ఎక్కడపడితే అక్కడ అంగళ్లు
- ఇష్టారాజ్యంగా పార్క్ చేస్తున్న వాహనాలు
- ఎవరి దారి వారిదే అన్నట్టు పాదచారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తిరుపతి నగరంలో ఎవరికి వారు.. యమునాతీరే అన్న చందంగా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. అంగళ్ల ఏర్పాటు సైతం ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలవ్వడం పరిపాటిగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అంగళ్ల నిర్వాహకుల వద్ద సంబంధిత అధికారులు మామూళ్లు తీసుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధ్యాత్మిక కేంద్రమైన తిరుపతికి ప్రతి రోజూ వేలాది మంది భక్తులు, పర్యాటకులు వచ్చి వెళుతుంటారు. దీంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. నగరంలో పలు ప్రాంతాల్లోని రోడ్లపైనే అంగళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఫలితంగా వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అంగళ్లకు వచ్చిన కొనుగోలు దారులు కూడా వాహనాలను ఎక్కడ పడితే అక్కడే పార్కింగ్ చేసేస్తున్నారు. రోడ్డుపైనే వాహనాలను ఆపి వ్యాపారుల వద్ద బేరాలు ఆడుతూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల వాహనాలను సైతం రోడ్డుపైనే నిలిపి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఆటోవాలాలు అయితే మరీను. ఆటో స్పీడుగా వెళుతూ రోడ్డుపైన ఎవరైనా నిల్చొని కనిపిస్తే ఇండికేటర్ వేయకనే వెంటనే నిలువునా ఆపేడం, ఆటోని తిప్పుకోవడం చేస్తున్నారు. ఫలితంగా వెనుక వస్తున్న వాహనదారుడు ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ విషయంపై స్థానికులు పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది.



బైరాగిపట్టెడ నుంచి ఎస్పీడీసీఎల్ కార్యాలయం మార్గంలో ఇష్టారాజ్యంగా వెళుతున్న వాహనదారులు, రోడ్డుపైనే నిలిపిన స్కూల్ బస్సులు

వ్యక్తి దారుణ హత్య

- కిడ్నాప్ చేసి కత్తులతో దాడి
- ఆస్పత్రి తరలిస్తుండగా బాధితుడి మృతి


లక్ష్మయ్య మృతదేహం


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బాలాయపల్లి (సైదాపురం) : బాలాయపల్లె మండలం జయంపు గ్రామంలో మంగళవారం రాత్రి ఆలయం లక్ష్మయ్య (50) అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. వివరాలు.. గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి లక్ష్మయ్యను కిడ్నాప్ చేశారు. గ్రామ శివారులోని పొలాల్లోకి తీసుకెళ్లి కత్తులతో దాడి చేశారు. చిత్రహింసలకు గురిచేసి చేతి వేళ్లను నరికేశారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్యను పొల్లాలనే పడేసి వెళ్లిపోయారు. లక్ష్మయ్య కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెంటనే బాలాయపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే బంధువులు గాలింపు చర్యలు చేపట్టగా గ్రామ సమీపంలోని పొలంలో రక్తపుమడుగులో పడి ఉన్న లక్ష్మయ్యను గుర్తించారు. హుటాహుటిన గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే లక్ష్మయ్య మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. బుధవారం జయంపులో వెంకటగిరి సీఐ ఏవీ రమణ విచారణ చేపట్టారు. కేసును త్వరలోనే ఛేదిస్తామని వెల్లడించారు.

పాతకక్షలే కారణమా....?

గ్రామంలో గత శనివారం లక్ష్మయ్యకు, మరో కుటుంబానికి ఘర్షణ జరిగింది. ఈ మేరకు పోలీసులు లక్ష్మయ్యపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. మంగళవారమే విడుదల చేశారు. సాయంత్రం గ్రామానికి చేరుకున్న లక్ష్మయ్యను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి హత్య చేశారు. పాతకక్షల నేపథ్యంలోనే ఘటన జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

యువకుడికి కత్తిపోట్లు

- పరిస్థితి విషమం
- పరారీలో నిందితుడు
- గాలిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి : పట్టణంలో బుధవారం రాత్రి ఓ యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. వివరాలు.. బుచ్చినాయుడు కండ్రిగ మండలం నెలవాయికి చెందిన విష్ణువర్ధన్ ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్నాడు. పుట్టినరోజు కావడంతో స్నేహితులతో వేడుకలు జరుపుకునేందుకు వచ్చాడు. కేక్ కట్ చేసి మిత్రులకు పంచిపెడుతుండగా ఓ యువకుడు అక్కడు వచ్చాడు. కేక్ కట్ చేసి కత్తితో విష్ణువర్ధన్‌పై దాడి చేశాడు. వరుసగా ఐదు పోట్లు పొడిచేశాడు. అడ్డుకోబోయిన మరో యువకుడిని కూడా గాయపరిచాడు. విష్ణువర్ధన్ తీవ్రగాయాలతో అక్కడ నుంచి పరుగులు తీశాడు. స్నేహితులు హుటాహుటిన బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితి వెళ్లిపోవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితుడు వివరాలు చెప్పే పరిస్థితి లేకపోవడంతో అతడు కోలుకున్న తర్వాతే అన్ని విషయాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. ఇందుకోసం సిబ్బందిని తిరుపతి పంపినట్లు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తిలో వరుసగా కత్తులతో దాడులు జరుతుండడంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం గంజాయి మత్తులో ముని అనే యువకుడు ముగ్గురిపై కత్తితో దాడి చేసిన ఘటనను మరువకముందే మరో ఘటన చోటుచేసుకోవడంపై భయాందోళనకు గురవుతున్నారు.


చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్

బాలికపై దాడి కేసులో దర్యాప్తు

– పోలీసుల అదుపులో అనుమానితులు?

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలంలో సోమవారం సాయంత్రం దళిత బాలికపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరు ఎర్రావారిపాళెం మండలం యల్లమంద, ఒడ్లకుంట, బోడేవాండ్లపల్లెకు చెందిన ఐదుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఎస్ఐ డీవై స్వామిని వివరణ కోరగా విచారణ జరుగుతోందన్నారు. ఎస్పీ ఆదేశాలు మేరకు కొన్ని బృందాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు.

మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఎంకామ్, ఎంఏ తెలుగు, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం)లో ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం, అర్హత, ఫీజు, కోర్సు వివరాలు యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. స్పాట్ అడ్మిషన్ల కోసం ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందజేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 0877-2284524, 8121787415 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఇంటర్వ్యూ

తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ స్థానంలో (ఆర్ఏఆర్ఎస్) రెండు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కార్యాల య అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాంట్ ఫెథాలజీ, వైరాలజీ, బయోకెమిస్ట్రీలో మాస్టర్ డిగ్రీ, ఫామ్ మిషనరీలో ఎంటెక్ చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆంగ్రో అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

యువతి ఆత్మహత్యపై విచారణ


మాట్లాడుతున్న సీఐ బాబీ

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని సప్తగిరి చెరువు కట్ట వద్ద ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన వై.లక్ష్మీప్రియ(18) కేసులో పూర్తి స్థాయి విచారణ చేపట్టినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో యువతి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ లక్ష్మీప్రియ ఆత్మహత్య కేసును పకడ్బందీగా దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

సంఘమిత్ర తొలగింపుపై ఆగ్రహం


ఏపీఎంను నిలదీస్తున్న మహిళ (సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యం)

శ్రీకాళహస్తి: సంఘమిత్రను అకారణంగా తొలగించడంపై పొదుపు మహిళలు మండిపడ్డారు. ఈ మేరకు ఏపీఎం ఇందిరాగాంధీని నిలదీశారు. ఈ ఘటన బుధవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీడీపీ నేతల ఆదేశాల మేరకు సంఘమిత్ర రేవతిని తొలగించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. దీంతో రేవతి ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో మంగళవారం తాటిపర్తి పంచాయతీలో పొదుపు సంఘాలతో ఏపీఎం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలు మాట్లాడుతూ తాము ఫిర్యాదు చేయకుండా సంఘమిత్రను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. టీడీపీ నేతల తరఫున వకాల్తా పుచ్చుకుని ఎలా మాట్లాడతారని ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ వేధింపులు తట్టుకోలేకే రేవతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపించారు. రేవతికి మద్దతుగా నిలిస్తే రుణాలు మంజూరు కావని బెదిరించడం తగదని ఏపీఎంపై మండిపడ్డారు. ఈ మేరకు సీఐటీయూ నేతలు మాట్లాడుతూ తోటి మహిళ అనే కనికరం కూడా లేకుండా ఏపీఎం ఇందిరాగాంధీ అహంకారపూరితంగా మాట్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘమిత్రను తొలగించే అధికారం వీఓకే ఉంటుందని తెలిసి కూడా టీడీపీ నేతల మాటలను వల్లిస్తున్న ఏపీఎంను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మిక హక్కుల రక్షణే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

తిరుపతి కల్చరల్ : కార్మికుల హక్కుల రక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం తిరుపతి బైరాగి పట్టెడలో గంధమనేని శివయ్య భవన్‌లో ప్రజా సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 26న దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తెచ్చి పెట్టుబడిదారులకు లాభం చేకూర్చేందుకు యత్నిస్తోందని విమర్శించారు. కేంద్రానికి కూటమి ప్రభుత్వం వంత పాడుతోందని మండిపడ్డారు. ఈ క్రమంలోనే మొదటి దశ ఉద్యమానికి కార్మిక సంఘాల ఐక్య వేదిక, రైతు సంఘాల సమన్వయ సమితి సంయుక్తంగా శ్రీకారం చుట్టాయని వెల్లడించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ప్రజా సంఘాల నేతలు విశ్వనాథం, చలపతి, ఎన్‌డీ రవి, కేవై రాజా, గోవింద స్వామి, వెంకటేష్, నాగరాజు, ప్రమీల, శ్రీరాములు, హరికృష్ణ, ఉదయ్‌కుమార్, సాయిలక్ష్మి, వేణుగోపాల్, బుజ్జి, జయచంద్ర పాల్గొన్నారు.

15 ఇసుక ట్రాక్టర్లకు జరిమానా


ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ తిమ్మయ్య

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని, నిబంధనలు పాటించకపోతే జైలుకు పంపిస్తామని తొట్టంబేడు సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. రెండు రోజుల క్రితం పెన్నలపాడు నుంచి ఇసుక ట్రాక్టర్లు ఓవర్ స్పీడ్‌గా వస్తుండడంతో ఎదురుగా వస్తున్న ఓ రైతు దాని నుంచి తప్పించుకునే యత్నంలో పక్కనే ఉన్న పొలాల్లో పడిపోయాడు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతుండడంతో బుధవారం పెన్నలపాడు రోడ్డు మార్గంలో సీఐ వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని 15 ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి మొత్తం రూ.30వేల జరిమానా విధించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రభుత్వం నిర్దేశించిన రీచ్‌ల నుంచి ఇసుక తీసుకెళ్లవచ్చని, రాత్రి వేళ తరలిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవన్నారు. కేవలం ట్రాక్టర్లలోనే తరలించాలని, జేసీబీలు, టిప్పర్లు, లారీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మళ్లీ ట్రాక్టర్ డ్రైవర్లు తప్పిదాలు చేస్తే జైలుకు పంపడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

'పాపకన్ను' సేవలు మరువలేం


కర్మక్రియలకు హాజరైన భూమన, మేకపాటి, నల్లపరెడ్డి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మురళీధర్, ఎంపీ గురుమూర్తి

రాపూరు : వైఎస్సార్‌సీపీ నేత పాపకన్ను రాజశేఖర రెడ్డి సేవలు మరువలేమని పలువురు నేతలు, ప్రజా ప్రతినిధులు కొనియాడారు. పార్టీ బలోపేతానికి ఆయన కృషి ఎనలేనిదని వెల్లడించారు. బుధవారం రాపూరు మండలం వేపినాపి గ్రామంలో పాపకన్ను రాజశేఖరరెడ్డి కర్మక్రియలను ఘనంగా నిర్వహించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో వివిధ పార్టీల నేతలు, అభిమానులు హాజరయ్యారు. పాపకన్ను చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆయన కుమారుడు నిరంజన్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, భూమన అభినయరెడ్డి, మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, మైనార్టీ నేతలు డాక్టర్ ఖాదర్‌బాషా, పార్టీ నేతలు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, చలపతిరావు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో కానిస్టేబుల్ అరెస్ట్

తిరుపతి క్రైమ్ : చంద్రగిరి నియోజకవర్గం ఎర్రావారిపాళెంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ చలమకుంట గుర్రప్ప (పీసీ నంబర్ 2958)ను ఎర్రచందనం కేసులో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల క్రితం అవినీతి ఆరోపణలతో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశామన్నారు. బుధవారం ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక కేసులో దర్యాప్తు చేయగా అందులో కానిస్టేబుల్‌కు ప్రమేయం ఉన్నట్లుగా గుర్తించామన్నారు. నిందితులతో గుర్రప్పకు సంబంధం ఉన్నట్లుగా నిర్ధారణైనట్లు వెల్లడించారు. ఈ కేసులో కానిస్టేబుల్‌ను ఏ4గా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

• కదంతొక్కిన విద్యార్థులు



"అధికారంలోకి వచ్చే వరకు అది చేసేస్తాం.. ఇది ఇచ్చేస్తాం అంటూ ఊదరగొడతారు. కుర్చీ ఎక్కగానే ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కేస్తారు. ఎన్నికల సమయంలో ఆశల పల్లకిలో ఎక్కిస్తారు. ఓటేయించుకున్న తర్వాత పాతాళానికి తొక్కేస్తారు" అంటూ విద్యార్థులు మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును విడుదల చేయని కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. పేద విద్యార్థులకు ఫీజులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలు పెంచాలని స్పష్టం చేశారు. లేకుంటే మరింత ఉధృతంగా పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. – తిరుపతి అర్బన్